ఆదివాసీ విద్యార్థులకు ఓయూ రిజిస్ట్రార్ విరాళం


ఆదివాసీ విద్యార్థులతో ప్రొ.లక్ష్మీనారాయణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఆదివాసీ విద్యార్థులకు ఓయూ రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ సొంతంగా రూ.50 వేలను విరాళంగా అందజేశారు. అకాడమిక్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా ములుగు జిల్లా మేడారానికి సమీపంలోని అటవీ ప్రాంతంలో గల సారలమ్మ గుంపు ఆదివాసీ గూడెంలో సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆదివాసీ పాఠశాల నిర్వాహకులు ఏర్పాటు చేసిన బీసీహెచ్‌సీ ఉత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఆదివాసీ పిల్లల చదువుల కోసం ఓయూ పూర్వ విద్యార్థులు ఈశ్రం సంతోష్, నరేశ్ ఇతర మిత్రులతో కలిసి నాలుగేళ్ల క్రితం పాఠశాల ఏర్పాటు చేసి ఉచిత విద్యను అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈఎంఎంఆర్‌సీ డైరెక్టర్ రఘుపతితో పాటు పీహెచ్‌డీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆమరణ నిరాహార దీక్ష భగ్నం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షను పోలీసులు భగ్నం చేసి ఐదుగురు విద్యార్థులను అరెస్ట్ చేశారు. విద్యార్థి జేఏసీ నేత మోతీలాల్ ఆధ్వర్యంలో గ్రూప్–2, 3, ఇతర ఉద్యోగాల సంఖ్యను పెంచాలని డిమండ్ చేస్తూ సోమవారం ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. పోలీస్ స్టేషన్‌లోనూ నిరాహార దీక్షను కొనసాగిస్తామని మోతీలాల్ నాయక్ తెలిపారు.

డిసెంబర్‌లో గ్రూప్స్ నిర్వహించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: గ్రూప్–2, 3 పరీక్షలను డిసెంబర్‌లో నిర్వహించాలని నిరుద్యోగులు కోరారు. ఈ మేరకు టీఎస్‌పీఎస్సీ అధికారులతో చర్చించాలని కోరుతూ సౌతిండియా పొలిటికల్ జేఏసీ చైర్మన్ ప్రొ.గాలి వినోద్ కుమార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. డీఎస్సీతో పాటు గ్రూప్స్ కూడా నిర్వహించేలా చూడాలని కోరినట్లు నిరుద్యోగులు తెలిపారు.

మారేడుపల్లిలో హెచ్‌టీ ఎలక్ట్రికల్ పోల్స్ సర్వే


సర్వే చేస్తున్న ఏఈ శ్రీధర్

అడ్డగుట్ట: మారేడుపల్లి ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్ పరిధిలో హెచ్‌టీ ఎలక్ట్రికల్ పోల్స్ సర్వే నిర్వహిస్తున్నట్లు ఏఈ శ్రీధర్ తెలిపారు. అడ్డగుట్టలోని పలు హెచ్‌టీ ఎలక్ట్రికల్ పోల్స్, ట్రాన్స్‌ఫార్మర్లను సోమవారం పరిశీలించారు. అదేవిధంగా మరమ్మతులు చేపట్టాల్సిన వాటిని కూడా పరిశీలించి టీజీఏఐఎంఎస్ అనే యాప్ ద్వారా సమాచారం సేకరించి అప్‌లోడ్ చేస్తున్నామని చెప్పారు. దీని ద్వారా విద్యుత్ సరఫరాలో ఏవైన లోపాలు ఉన్నా, అంతరాయం ఏర్పడినా వెంటనే తెలుసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. విద్యుత్ సంబంధిత మరమ్మతుల విషయంలో సిబ్బంది ఎక్కడ పని చేస్తున్నారు.. ఎంత సమయం తీసుకుంటున్నారు అనే అంశాలతో పాటు సిబ్బంది పనితీరు ఎప్పటికప్పుడు పర్యవేక్షణలో ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి శుభాకాంక్షలు


కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని సన్మానిస్తున్న సాయిరాం రాథోడ్

సనత్‌నగర్: కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టి నగరానికి వచ్చిన కిషన్‌రెడ్డిని సనత్‌నగర్ నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు సోమవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కలిసిన వారిలో బీజేపీ గిరిజనమోర్చా మహంకాళి–సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి సోమ్లా సాయిరాం రాథోడ్, పలువురు నేతలు ఉన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం..!

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ప్రాంతంలోని గురుద్వారా ప్రధాన రహదారిపై ప్రమాదం పొంచి ఉన్నది. గతంలో ఈ రోడ్డు కింద ఉండే నాలాపై జీహెచ్‌ఎంసీ అధికారులు స్లాబు వేశారు. అయితే నిత్యం వందలాది వాహనాలు తిరుగుతుండడంతో నాసిరంగా నిర్మించిన మ్యాన్‌హోల్ 10 రోజుల క్రితం కుంగి భారీ గుంత ఏర్పడింది. రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనదారులు గుంతలో పడి గాయాలపాలవుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి గుంతను పూడ్చివేయాలని కోరుతున్నారు.



దివ్యాంగులకు ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ చేయూత


దివ్యాంగులకు బ్యాటరీ వాహనాలు అందజేసిన ఎస్‌ఆర్‌ఆర్ అధినేత శ్రీనివాస్‌రెడ్డి

సనత్‌నగర్: దివ్యాంగులకు ఎస్‌ఆర్‌ఆర్ ఫార్చ్యూన్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ సంస్థ చేయూతనందించి ఉదారతను చాటుకుంది. సనత్‌నగర్ జెక్‌కాలనీలో సోమవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో ఆ సంస్థ అధినేత పరుపాటి శ్రీనివాస్ రెడ్డి వరంగల్ జిల్లా రాయపర్తి మండలానికి చెందిన 20 మంది దివ్యాంగులకు బ్యాటరీ వాహనాలను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ కొందరు దివ్యాంగులు నడవలేని స్థితిలో ఉండి ఇబ్బందులు పడుతున్నారని తమ దృష్టికి రాగా వెంటనే ఫౌండేషన్ తరఫున వాహనాలు అందించామని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు సురేంద్ర రాథోడ్‌నాయక్, ఫిజికల్ హ్యాండీక్యాప్డ్ సంఘం నాయకులు సుధాకర్, మధుకర్‌రెడ్డి, కృష్ణనాయక్, మహేందర్‌రెడ్డి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఓయూ వీసీగా ఎస్సీని నియమించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: వందేళ్లు పూర్తి చేసుకున్న ఓయూకు ఓసీలే వీసీలుగా ఉంటున్నారని సౌతిండియా పొలిటికల్ జేఏసీ చైర్మన్ ప్రొ.గాలి వినోద్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ముస్లింలు, రెడ్డిలు, బ్రాహ్మణులు, బీసీలు తదితర సామాజిక వర్గాలకు చెందిన ప్రొఫెసర్లు ఓయూకు వీసీలుగా పని చేశారని, కానీ ఇప్పటివరకు ఎస్సీలు, ఎస్టీలు, క్రిష్టియన్లు, మహిళలు, దివ్యాంగులు వీసీలుగా నియమించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీలు, ఎస్టీలు దేశానికి రాష్ట్రపతులుగా పని చేశారని, కానీ ఓయూ వీసీగా మాత్రం అవకాశం రాలేదని, ఈసారైన ఎస్సీ ప్రొఫెసర్‌ను వీసీగా నియమించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు.

రేపు రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల బంద్

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రవ్యాప్తంగా రేపు (26న) పాఠశాలల బంద్ నిర్వహించనున్నట్లు ఏబీవీపీ నాయకులు ఓయూలో సోమవారం తెలిపారు. ప్రభుత్వ స్కూల్స్‌లో మౌలిక వసతులు కల్పించాలని అధిక ఫీజులు వసులు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌పై బంద్ చేస్తున్నట్లు ఏబీవీపీ స్టేట్ జాయింట్ సెక్రెటరీ పృథ్వీతేజ పేర్కొన్నారు. ఇప్పటివరకు విద్యార్థులకు పుస్తకాలు, స్కూల్ యూనిఫాంలు ఇవ్వలేదని అన్ని పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనంలో పోషకాహారం అందించాలని డిమాండ్ చేశారు. బంద్‌కు విద్యార్థులతో పాటు తల్లిందండ్రులు, టీచర్లు, ఉద్యోగులు సహకరించాలని ఆయన కోరారు.

నిరుద్యోగులకు ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలి


ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న నిరుద్యోగ సంఘం నేతలు

లాలాపేట: సీఎం రేవంత్‌రెడ్డి నిరుద్యోగులకు ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని దక్షిణ భారత రాజకీయ జేఏసీ చైర్మన్ ప్రొ గాలి వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. తార్నాకలోని ఆయన కార్యాలయంలో పలువురు నిరుద్యోగ సంఘం నేతలు సోమవారం ఆయనను కలిసి నిరుద్యోగుల సమస్యలపై మాట్లాడాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ గతేడాది అక్టోబర్ 1న సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో నిరుద్యోగులు ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరైన ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే గ్రూప్ 2, గ్రూప్ 3 పోస్టులను పెంచి అన్ని ఉద్యోగ పరీక్షలను అందరూ రాసుకునేలా వెసులుబాటు కల్పిస్తానని, పరీక్షలకు నిర్దిష్టమైన వ్యవధి ఉండేలా జాబ్ క్యాలెండర్ రూపొందిస్తామని హామీనిచ్చారని గుర్తు చేశారు. వెంటనే తగు చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో నిరుద్యోగ సంఘం నేతలు ఏ జనార్దన్, ఇంద్రప్రసాద్ నాయక్, సీహెచ్ చంద్రశేఖర్, యుగేందర్, మహేశ్‌కుమార్ , చంద్రకుమార్ తదితరులు ఉన్నారు.

ఆమోదం.. అనుమతులు

కంటోన్మెంట్ బోర్డు సమావేశంలో కీలక నిర్ణయాలు

- కారుణ్య నియామకాలకు గ్రీన్ సిగ్నల్
- త్వరలోనే 22 మందికి ఉద్యోగాలు
- పలు టెండర్లకు ఆమోదం, పరిపాలన పర్మిషన్లు
- అక్రమ నిర్మాణాలకు నోటీసులు జారీ


సమావేశంలో పాల్గొన్న మిలటరీ, బోర్డు అధికారులు, ఎమ్మెల్యే, నామినేటెడ్ సభ్యుడు

కంటోన్మెంట్: కంటోన్మెంట్ బోర్డు అధ్యక్షుడు, బ్రిగేడియర్ సోమశంకర్ నేతృత్వంలో సోమవారం జరిగిన సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పలు టెండర్లకు ఆమోదం తెలపగా.. అభివృద్ధి పనులకు పరిపాలన అనుమతులు ఇచ్చారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో కారుణ్య నియామకాలకు సైతం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కంటోన్మెంట్ జనరల్ ఆసుపత్రి ఆవరణలో 20 కిలోలీటర్ల సామర్థ్యం గల సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటుకు ఆమోదం.. ట్రాఫిక్ అంబ్రెల్లాల ఏర్పాటు.. పలు అభివృద్ధి పనులకు పరిపాలన అనుమతుల మంజూరు.. యథేచ్ఛగా సాగుతున్న అక్రమ నిర్మాణాలకు నోటీసుల జారీ.. వీధి కుక్కల నియంత్రణ, యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ సేవల బాధ్యతను బ్లూక్రాస్‌కు అప్పగించడం లాంటి నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశంలో సీఈఓ మధుకర్ నాయక్, బోర్డు సివిలియన్ నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ, ప్రత్యేక ఆహ్వానితుడిగా ఎమ్మెల్యే శ్రీగణేశ్, బోర్డు అధికారులు పాల్గొన్నారు.

కొందరికే కారుణ్యం..

కంటోన్మెంట్ పరిధిలో 2010 నుంచి కారుణ్య నియామకాలు నిలిచిపోయాయి. నాటి నుంచి ఇప్పటివరకు 122 మంది సిబ్బంది సర్వీసులో ఉండగానే చనిపోయారు. వీరి స్థానంలో మృతుల కుటుంబ సభ్యుల్లో ఒకరి చొప్పున ఉద్యోగాలు కల్పించాల్సి ఉంది. అయితే రక్షణ శాఖ నిబంధనల మేరకు ఖాళీల్లో 5 శాతానికి మించి కారుణ్య నియామకాలు చేపట్టేందుకు వీలులేదు. ఖాళీలకంటే ఉద్యోగార్థులు సంఖ్య ఎక్కువగా ఉండడంతో 5 శాతం సీలింగ్‌ను ఎత్తివేయాలని కొన్నేళ్లుగా బోర్డు ఉద్యోగ సంఘం నేతలు పోరాడుతున్నారు. తాజాగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ద్వారా రక్షణ మంత్రికి సిఫారసు కూడా చేశారు. అయినా సీలింగ్ ఎత్తేయడం కుదరదని రక్షణ శాఖ ఉన్నతాధికారులు తేల్చేశారు. ఈ నేపథ్యంలో మొత్తం ఉద్యోగార్థుల్లో మెరిట్ పాయింట్ ప్రకారం 22 మందికి ఉద్యోగాలు కల్పించాలని తీర్మానించారు.

ఎమ్మెల్యేకు తొలి.. అధ్యక్షుడికి ఆఖరి సమావేశం

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్ తొలిసారిగా కంటోన్మెంట్ బోర్డు సమావేశంలో పాల్గొన్నారు. యాధృచ్ఛికంగా బోర్డు అధ్యక్షుడికి ఇదే ఆఖరిది కావడం గమనార్హం. స్థానిక మిలటరీ స్టేషన్ కమాండర్ అయిన బ్రిగేడియర్ సోమశంకర్ ఏడాదిన్నరగా బోర్డు సభ్యుడిగా కొనసాగుతున్నారు. మూడున్నర దశాబ్దాలపాటు మిలటరీలో వివిధ హోదాల్లో పనిచేసిన ఆయన ఈ నెలాఖరున విరమణ చేయనున్నారు. తొలిసారిగా సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే శ్రీగణేశ్‌కు బోర్డు అధ్యక్షుడు బ్రిగేడియర్ సోమశంకర్, సీఈఓ మధుకర్ నాయక్ పుష్పగుచ్ఛం అందజేసి ఆహ్వానించారు. సివిలియన్ నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ ఎమ్మెల్యేకు అభినందనలు తెలిపారు.

చెత్త డంపింగ్ కేంద్రం ఎత్తేయండి : ఎమ్మెల్యే

లాల్‌బజార్ గాంధీ కమ్యూనిటీ హాల్ ఆవరణలో ఏర్పాటు చేసిన చెత్త డంపింగ్ కేంద్రాన్ని తక్షణమే ఎత్తేయాలని ఎమ్మెల్యే శ్రీగణేశ్ బోర్డు ఉన్నతాధికారులను కోరారు. ఏ తీర్మానం మేరకు ఈ ప్రాంతాన్ని తాత్కాలిక డంపింగ్ యార్డుగా గుర్తించారని, 8 వార్డుల చెత్తను ఒకే ప్రాంతానికి తరలించడంతో సమీప బస్తీవాసులు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారని డంపింగ్ కేంద్రాన్ని అక్కడి నుంచి తరలించాలని కోరారు. లేకుంటే వార్డుల వారీగా ఎక్కడికక్కడే తాత్కాలిక డంపింగ్ యార్డులు ఏర్పాటు చేయాలని కోరారు. ఎమ్మెల్యే సూచనతో ఏకీభవించిన బోర్డు అధ్యక్షుడు తక్షణమే చర్యలు చేపట్టాలని బోర్డు అధికారులను ఆదేశించారు. గాంధీ కమ్యూనిటీ హాల్‌ను నిబంధనలకు విరుద్ధంగా ధ్వంసం చేసి ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకోని తక్షణమే పునరుద్ధరించాలని కోరారు. అవసరమైతే తన ఎమ్మెల్యే నిధులు కేటాయిస్తానని పేర్కొన్నారు. కంటోన్మెంట్‌లోని 8 వార్డుల్లో ఒక్కో మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మిస్తామని, ఇందుకు అవసరమైన ప్రభుత్వ స్థలాలు సూచించాలని ఎమ్మెల్యే బోర్డు అధికారులను కోరారు. ఏడోవార్డు సాయిబాబా హట్స్‌లో తాను గతంలో సొంత నిధులతో టాయిలెట్‌లు ఏర్పాటు చేయించానని, అయితే నీటి సదుపాయం లేక నిరుపయోగంగా మారాయన్నారు. బోర్‌వెల్ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని కోరారు.

ఆసుపత్రిని రాష్ట్రానికి అప్పగిద్దాం : రామకృష్ణ

కంటోన్మెంట్ జనరల్ ఆసుపత్రి నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగిద్దామని బోర్డు సివిలియన్ నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ అన్నారు. గతంలోనే బోర్డు తీర్మానం చేసిందని నాటి ఎంపీ, ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి సైతం ఈ నిర్ణయాన్ని స్వాగతించారని మళ్లీ ప్రతిపాదనను సీఎం దృష్టికి తీసుకెళ్దామని సూచించారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే కూడా కాంగ్రెస్‌కు చెందిన వారు కావడంతో ప్రక్రియ కూడా త్వరగా పూర్తవుతుందన్నారు. సీఈఓ మధుకర్ నాయక్ స్పందిస్తూ.. కంటోన్మెంట్ జనరల్ ఆసుపత్రి అభివృద్ధి విషయంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ చూపుతున్నారన్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారుల బృందం ఇటీవలే ఆసుపత్రిని సందర్శించినట్లు తెలిపారు. డయాగ్నోస్టిక్ హబ్‌గా మార్చాలని, ఆరోగ్యశ్రీ సదుపాయం, ఉచిత మందుల పంపిణీ చేపట్టేలా ప్రతిపాదలను చేసినట్లు వెల్లడించారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.55, నల్లవంకాయ 35, పొడుగు వంకాయ 35, బెండకాయ 45, పచ్చిమిర్చి 65, బజ్జీమిర్చి 60, క్యాప్సికం 70, పచ్చకాకర 52, పందిరి బీర 45, క్యాబేజీ 25, క్యారెట్ 40, దొండ 21, గుండుబీన్స్ 85, గింజ చిక్కుడు 65, గోకరకాయ 50, కీర 28, దోసకాయ 23, రూట్‌రూట్ 25, ఉల్లిగడ్డ 32, ఆలుగడ్డ 35, చామగడ్డ 37, మొరంగడ్డ 40, కందగడ్డ 50, సొరకాయ 11, పొట్లకాయ 35, అరటికాయ 9, మునగకాయ 4–5, ముల్లంగి 5–6. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.


నేడు ప్రత్యేక పూజలు

సనత్‌నగర్: అంగారక సంకటహర చతుర్థి సందర్భంగా సనత్‌నగర్ హనుమాన్, శ్రీగణపతి ఆలయాల్లో ఈ నెల 25న (నేడు) విశేష పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ శ్రీనివాసరాజు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6.30 గంటలకు గణపతి హోమం, సాయంత్రం 6 గంటలకు పంచామృత అభిషేకం, ప్రత్యేక అలంకరణ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

సమావేశానికి రావాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం

సనత్‌నగర్: ఆషాఢ మాస బోనాల ఉత్సవాల నిర్వహణ, ఏర్పాట్లపై ఈ నెల 26వ తేదీన నిర్వహించనున్న సమావేశానికి హాజరుకావాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను దేవాదాయ శాఖ అధికారులు కోరారు. ఈ మేరకు సికింద్రాబాద్‌లోని

వ్యక్తి అదృశ్యం



అడ్డగుట్ట: లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. నార్త్‌లాలాగూడ ప్రాంతానికి చెందిన మహ్మద్ ఫయాజ్ (37) కు ఇటీవల పెళ్లి సంబంధం కుదిరింది. అయితే మే 30న తన స్నేహితుడిని కలిసివస్తానని ఇంట్లో చెప్పి వెళ్లి మళ్లీ తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు బంధువులు, స్నేహితుల వద్ద ఆచూకీ గాలించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో ఆదివారం రాత్రి ఫయాజ్ కుటుంబసభ్యులు స్థానిక లాలాగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ఓయూలో ఎమర్జెన్సీ వ్యతిరేక దినోత్సవం

హాజరుకానున్న మాజీ గవర్నర్ విద్యాసాగర్ రావు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో ఈ నెల 25న (నేడు) ఎమర్జెన్సీ వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఏబీవీపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ప్రొ.శంకర్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఓయూ క్యాంపస్ ఆర్ట్స్ కాలేజీ 57వ తరగతి గదిలో ఉదయం 11 గంటలకు జరిగే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్ రావు హాజరుకానున్నట్లు తెలిపారు. ఎమర్జెన్సీ వ్యతిరేక ఉద్యమంలో పాల్గొన్న విద్యాసాగర్ రావు నాటి చరిత్రను విద్యార్థులకు వివరిస్తారని, విద్యార్థులు, అధ్యాపకులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు.

సమస్యలు పరిష్కరించాలి

లాలాపేట: తమ సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర గొర్రెల, మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డా. కొమ్ము అశోక్ యాదవ్ కోరారు. ఈ మేరకు సంఘం ప్రతినిధులతో కలిసి సెక్రటేరియట్‌లో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండో విడత గొర్రెల పంపిణీ కోసం డీడీలు చెల్లించి దాదాపు రెండేళ్లు కావస్తున్నా యూనిట్లు మాత్రం పంపిణీ చేయలేదన్నారు. తమకు న్యాయం చేయాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం సలహాదారు బేరి రాంచందర్ యాదవ్, గుండు తిరుపతి, వెంకటేశ్వర్లు, సురేందర్‌రెడ్డి, శేఖర్,యశ్వంత్ తదితరులు ఉన్నారు.




లబ్ధిదారులకు ఇండ్లు కేటాయించండి


ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న మర్రి శశిధర్‌రెడ్డి

సనత్‌నగర్: లబ్ధిదారులకు ఇండ్లను కేటాయించాలని ఎన్‌డీఎంఏ మాజీ వైస్‌చైర్మన్, సనత్‌నగర్ మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు సికింద్రాబాద్ ఆర్డీఓ దశరథ్‌సింగ్‌కు సోమవారం ఇండ్ల వివరాలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని చాలా ప్రాంతాల్లో ఇండ్ల నిర్మాణం పూర్తయి, లబ్ధిదారుల ఎంపికకు సర్వే కూడా చేపట్టారని, అయినా గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. బన్సీలాల్‌పేట నీలం బాలయ్యదొడ్డి ప్రాంతంలో కొందరు తప్పుడు పత్రాలు సృష్టించి అక్కడి పేదవాళ్లను తరలించే ప్రయత్నం చేయగా తాము అడ్డుకున్నట్లు పేర్కొన్నారు. దీనిపై న్యాయ పోరాటం చేసి అది ప్రభుత్వ స్థలామని నిరూపించి అక్కడ హెచ్చరిక బోర్డు కూడా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వంలోని కొందరి నాయకుల సహకారంతో మళ్లీ ఆ స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నిస్తున్నట్లు తెలిపారు. అందించిన వారిలో బీజేపీ యువ నాయకులు మర్రి పురురావరెడ్డి, నాయకులు సత్యనారాయణ, రఘునాథ్‌గౌడ్, కుమార్, దయానంద్, శ్రీలత, సంతోష్, పరమేశ్, సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకుంటాం


సనత్‌నగర్‌లో పర్యటిస్తున్న డీసీపీ

సనత్‌నగర్: నిఘాను మరింత కట్టుదిట్టం చేసి అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకుంటామని బాలానగర్ డీసీపీ సురేష్‌కుమార్ పేర్కొన్నారు. సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎస్‌ఆర్‌టీకాలనీ, జెక్‌కాలనీ, డీఎస్‌ఎంకాలనీ తదితర ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం పర్యటించి శాంతి భద్రతల విషయంలో పోలీసు అధికారులు తీసుకుంటున్న చర్యలపై ఆయన ఆరా తీశారు. అలాగే ప్రజల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి సిబ్బంది విధులు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలన్నారు. డయల్ 100 ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని ఆదేశించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. పోలీసు వ్యవస్థ, వారి పని తీరుపై ప్రజల్లో విశ్వాసం పెరగాలన్నారు. బాలానగర్ ఏసీపీ హనుమంతరావు, ఇన్‌స్పెక్టర్ పురేందర్‌రెడ్డి, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజరాజేశ్వరీ ఆలయంలో లక్ష పుష్పార్చన


అమ్మవారికి చేసిన లక్ష పుష్పార్చన

రాంగోపాల్‌పేట్: మోండా కుమ్మరిగూడలోని రాజరాజేశ్వరీ అమ్మవారి ఆలయంలో సోమవారం లక్ష పుష్పార్చన పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆలయ అష్టాదశ వార్షికోత్సవాల్లో భాగంగా రెండోరోజు ప్రాతఃకాల పూజలు, మూలమంత్ర అనుష్టానములు, అవాహిత మంటప దేవతా హోమాలు, వేదపారాయణం, చండీహోమం, మూల మంత్ర హోమాలతో పాటు లక్ష పుష్పార్చన పూజలు జరిగాయి. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఆలయ ఈవో విఠలయ్య, అభివృద్ధి కమిటీ సభ్యులు వీరలక్ష్మి, ఎస్ఎస్ కుమారి, గున్నాల ప్రభావతి, లలితా పారాయణ సత్సంగ్ అధ్యక్షురాలు విజయలక్ష్మి, కార్యదర్శి రాజేశ్వరి, కోశాధికారి అన్నపూర్ణ తదితరులు భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేశారు.

లబ్ధిదారులకు డబుల్ బెడ్రూంలు కేటాయించాలి


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న హేమ

చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్ సుభాష్‌చంద్రబోస్ నగర్‌లో నిర్మించిన డబుల్ బెడ్రూంలను లబ్ధిదారులకు కేటాయించాలని కార్పొరేటర్ సామల హేమ కోరారు. ఈ మేరకు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని ఆయన కార్యాలయంలో సోమవారం కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ సంఘాలకు ఎమ్మెల్యే పద్మారావు ఇచ్చిన హామీ మేరకు సీతాఫల్‌మండి చౌరస్తాలో బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాల ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేయడంతో విగ్రహాల చుట్టు పచ్చందాలు, విద్యుత్ వెలుగులు ఏర్పాటు చేయాలని కోరామన్నారు. కలెక్టర్‌ను సానుకూలంగా స్పందించారని ఆమె తెలిపారు. ఆమె వెంట బీఆర్ఎస్ నాయకులు బాబురావు, రవీంద్రసాగర్ పాల్గొన్నారు.

పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి

చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్‌లో పెండింగ్ పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని కార్పొరేటర్ సామల హేమ కోరారు. ఈ మేరకు జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ డిప్యూటీ కమిషనర్ సుభాష్‌రావును సోమవారం కలిసి పలు అంశాలపై చర్చించారు. బోనాల సందర్భంగా రోడ్లపై గుంతలు లేకుండా ప్యాచ్ వర్క్ పనులు చేపట్టాలని, చెట్ల కొమ్మలు తొలగించాలని, శ్రీనివాసనగర్, ప్రైడేమార్కెట్, మార్కండేయనగర్ తదితర ప్రాంతాల్లో నూతన రహదారులు వేసేందుకు అదనపు నిధులు కేటాయించాలని, పార్కుల సుందరీకరణ చేపట్టాలని విన్నవించారు. ఆయా సమస్యలపై డీసీ సానుకూలంగా స్పందించారని ఆమె తెలిపారు. సమావేశంలో ఉద్యానవనశాఖ డీడీ రాజ్‌కుమార్, ఇన్‌చార్జి గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలి


లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ సూచించారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన కార్యాలయంలో 17 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుపేద తల్లిదండ్రులకు ఆర్థిక సాయం అందించే పథకాలను అమలు చేసిందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ శేషుకుమారి, నాయకులు కొలను బాల్‌రెడ్డి, అశోక్‌యాదవ్, శేఖర్, బలరాం తదితరులు పాల్గొన్నారు.

గాంధీ మెడికల్ కాలేజీ అ'పూర్వ' విద్యార్థుల సమ్మేళనం

కాచిగూడ: గాంధీ మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీ అలుమ్నీ బిల్డింగ్‌లో సోమవారం నిర్వహించారు. డాక్టర్ నిమ్మతోట వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గాంధీ మెడికల్ కాలేజీ అలుమ్నీ అధ్యక్షుడు డాక్టర్ లింగమూర్తి ముఖ్యఅతిథిగా, ప్రొఫెసర్ డాక్టర్ టీవై శేఖర్, డాక్టర్లు జి.యాదయ్య, ప్రతాప్ రెడ్డి, లక్ష్మీ కాంతయ్య, లక్ష్మీనారాయణ, కొమురయ్య, బాలకృష్ణ, ఆనందబాబు తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.